డంప్ యార్డు సమస్య పరిష్కారానికి చర్యలు

- నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

నగరంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కార్పొరేషన్, జూన్ 24: నగరంలోని డంప్ యార్డు సమస్యను పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. మంగళవారం డంప్ యార్డు కోసం నగరంలోని చింతకుంట, మల్కాపూర్‌లో స్థలాలు పరిశీలించారు. ఆయా చోట్ల సర్వే పూర్తి చేసి డంప్ యార్డు విస్తీర్ణం వివరాలను అందించడంతో పాటు వాటి హద్దులను ఫిక్స్ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నగర పరిసర ప్రాంతాల్లో ఎక్కడా చెత్త కనబడకుండా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. సెగ్రిగేషన్ ప్రక్రియ సమర్థవంతంగా జరిపితేనే డంప్ యార్డుకు చెత్త తగ్గుతుందని, ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని జ్యోతిబా పూలే పార్కు, మంచిర్యాల చౌరస్తా, ఆదర్శనగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వేణుమాధవ్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల కోసం స్పెషల్ డెస్క్

టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి వచ్చే ఫిర్యాదుల కోసం స్పెషల్ డెస్క్ ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. మంగళవారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, వచ్చిన ఫిర్యాదులకు కంప్లైంట్ నంబర్ వేసి ప్రత్యేక రికార్డు నిర్వహించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్లీయర్ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్న వారిపై దృష్టి పెట్టి చర్యలు చేపట్టాలన్నారు. వర్షకాలం దృష్ట్యా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీంలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీసీపీ బషిరొద్దీన్, ఏసీపీలు శ్రీధర్, వేణుమాధవ్, టీపీఎస్‌లు సంధ్య రాజ్ కుమార్, తేజస్వీని, టీపీబీవోలు ఖాదర్ మొహియుద్దీన్, సాయి చరణ్, సాయి కిరణ్, నవీన్, నధియా, సూపరింటెండెంట్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలు

- కరీంనగర్ సీపీ గౌస్ ఆలం.. జమ్మికుంట ఠాణా తనిఖీ
- సోలార్ సీసీ కెమెరాల ప్రారంభం

జమ్మికుంట పీఎస్‌లో సోలార్ సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ గౌష్ ఆలం

జమ్మికుంట, జూన్24 : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, నేరాల నియంత్రణ కోసమే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. మంగళవారం ఆయన జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఠాణా తనిఖీ చేశారు. నేరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. అనంతరం టౌన్ సీఐ రామకృష్ణ స్టేషన్‌లో సోలార్ టెక్నాలజీతో పనిచేసే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, సీపీ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సోలార్ సీసీ కెమెరాలు జిల్లా కేంద్రంతో పాటు హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానంగా పనిచేస్తాయని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలను ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. శాసోలార్ సీసీ కెమెరాల ఏర్పాటు చేసిన సీఐని అభినందించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సీపీ వెంట హుజూరాబాద్ ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పోలీస్ స్టేషన్లను సందర్శించిన సీపీ

హుజూరాబాద్ రూరల్, జూన్ 24: పట్టణంలోని పోలీస్ స్టేషన్, కేసీ క్యాంపులోని రూరల్ సర్కిల్ కార్యాలయాలను సీపీ గౌష్ ఆలం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల పనితీరును, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏసీపీ మాధవి, టౌన్ సీఐ కరుణాకర్, హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ ఉన్నారు.

డివిజన్ల తుది జాబితాపై ఉత్కంఠ

జీవో 144 సోషల్ మీడియాలో చక్కర్లు • డివిజన్ల వెలువడని వివరాలు

కార్పొరేషన్, జూన్ 24: కరీంనగర్ నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన తుది జాబితా విషయంలో ఉత్కంఠ కొనసాగుతున్నది. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న డివిజన్ల తుది జాబితా రావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు అలాంటి జాబితా ప్రభుత్వం నుంచి వచ్చిన దాఖలాలు లేవు. కాగా మంగళవారం సాయంత్రం నుంచి సోషల్ మీడియాలో డివిజన్ల పునర్విభజనకు సంబంధించి సీడీఎంఏ కార్యాలయం విడుదల చేసినట్లు పేర్కొంటున్న జీవో నం.144 మాత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. దీంతో తుది జాబితాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందని ప్రచారం సాగింది. కాగా, ఇదే విషయంలో అధికారులను ప్రశ్నించగా ఇప్పటి వరకు తమకు అధికారికంగా ఎలాంటి వివరాలు అందలేదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం జీవో విడుదల చేసినా డివిజన్ల సరిహద్దులకు సంబంధించిన వివరాలను ఎందుకు విడుదల చేయలేదన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తానికి నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన వ్యవహారం మాత్రం అందరిలోనూ ఉత్కంఠ రేపుతున్నది.

జీజీహెచ్‌లో 'ప్రైవేట్' సిబ్బంది తిష్ట

విద్యానగర్, జూన్ 24: కరీంనగర్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ప్రైవేట్ దవాఖానల మార్కెటింగ్ సిబ్బంది తిష్ట వేస్తున్నారు. 108 సిబ్బంది తమ వాహనంలో తీసుకువచ్చిన పేషెంట్‌ను ప్రైవేట్ దవాఖానలకు తరలిస్తున్నారు. మంగళవారం రాత్రి గంగాధర దగ్గర కారు బైక్ ఢీకొన్న ఘటనలో మహేశ్‌కు తలకు గాయం కాగా, వెంటనే 108 సిబ్బంది జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. అంబులెన్స్ కరీంనగర్ దవాఖానకు రాకముందే అక్కడే మహేశ్ కోసం వేచి ఉన్న అకిరా హాస్పిటల్ అంబులెన్స్‌తో పాటు మార్కెటింగ్ సిబ్బంది హడావిడి చేస్తూ 108 సిబ్బందిపై గొడవకు దిగారు. ప్రభుత్వ దవాఖానలో ఎలాంటి సౌకర్యాలు లేవని, ప్రాణాపాయం ఉందని అపోహలు సృష్టించి, కనీసం దవాఖానలోకి తీసుకు వెళ్లకముందే ప్రైవేట్ అంబులెన్స్‌లో నేరుగా ఓ సీటీ స్కాన్ సెంటర్‌కు, అక్కడి నుంచి అకిరా హాస్పిటల్‌కు తరలించారు. సదరు మార్కెటింగ్ వ్యక్తి నేనే పేషెంట్ బంధువునని దవాఖానలో ఓ సంతకం చేయడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు హాస్పిటల్ ఆవరణలోకి వచ్చే ప్రైవేట్ వ్యక్తులతో పాటు అంబులెన్స్‌లపై చర్యలు తీసుకోవాలని 108 సిబ్బంది కోరుతున్నారు.

రైతు భరోసా సంబురాలకు కరెంట్ కట్‌కట

కరీంనగర్ రూరల్, జూన్ 24: మండలంలోని దుర్శేడ్ రైతు వేదికలో నిర్వహించిన రైతు భరోసా సంబురాల్లో కరెంటు లేక అంతరాయం ఏర్పడింది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు సీఎం వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం కాగా, అంతకు అరగంట ముందే కరెంట్ పోయింది. 5 గంటల తర్వాత కలెక్టర్ పమేలా సత్పతి హాజరు కాగా, అప్పటికీ కరెంటు రాకపోవడంతో విద్యుత్ అధికారులపై సీరియస్ అయ్యారు. దీంతో ఎస్ఈ, ఈఈ, ఏడీఏ, ఏఈలు దుర్శేడ్, గుంటూర్‌పల్లి, గోపాల్‌పూర్ విద్యుత్ సరఫరాను నిలిపి వేసి, రైతు వేదికకు విద్యుత్ సరఫరా చేశారు. సాయంత్రం 5:30 గంటల తర్వాత సీఎం వీడియోకాన్ఫరెన్స్ ప్రారంభం కావడంతో కలెక్టర్ పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. రైతు భరోసా కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముందుగా వీడియో కాన్ఫరెన్స్‌లో ఆన్‌లైన్ సమన్వతో వ్యవసాయ గీతం వినిపించకుండా పోయింది. దీంతో కలెక్టర్‌తోపాటు, జిల్లా అధికారులు వీసీలో మంత్రులు కూర్చునే వరకు అలాగే నిలబడి ఉండిపోయారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

కార్పొరేషన్, జూన్ 24: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వివిధ మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లను బదిలీ అయ్యారు. కొందరు కమిషనర్లకు పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న వేణుమాధవ్‌కు డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. కరీంనగర్ నగరపాలక సంస్థలోనే పోస్టింగ్ ఇచ్చారు. చొప్పదండి మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు, కరీంనగర్ నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ జీ దిలీప్‌కుమార్‌ను పదోన్నతిపై బదిలీ చేశారు.

డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ కృష్ణ ప్రసాద్

డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణ ప్రసాద్‌కు బొకే అందిస్తున్న ఏవోలు

విద్యానగర్, జూన్ 24: కరీంనగర్ డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ కృష్ణ ప్రసాద్‌ను నియమిస్తూ మంగళవారం తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కృష్ణ ప్రసాద్‌ను ఏవోలు నజీముల్లా ఖాన్, హైమద్ హుస్సేన్, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించాలి

హుజూరాబాద్ టౌన్, జూన్ 24: కార్పొరేటీకరణ, కేంద్రీకరణను ప్రోత్సహించే జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రప్రభుత్వం తిరస్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి సూచించారు. ఈనెల 27న ఇందిరాపార్క్‌లో జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం పాఠశాల విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే విధానాలను ప్రవేశ పెట్టే ఆలోచనను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, వేల్పుల రత్నం, శంకర్, అల్లి శ్రీనివాస్, మల్లేశం, వెంకట్రాజం పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు తెకస సంపూర్ణ మద్దతు

కలెక్టరేట్, జూన్ 24 : జూలై 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు రైతాంగం, వ్యవసాయ కూలీల పక్షాన సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ కర్షక సమితి జిల్లా అధ్యక్షుడు గుజ్జుల మహేందర్ తెలిపారు. మంగళవారం నగరంలోని ముకరంపురలో గల ఆసంఘం జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయిని సతీశ్, రెంటాల రవి, ముద్దసాని మహేందర్, పెంచాల శ్రీనివాస్, కట్కూరు మల్లేశ్, రాజుల్, శ్రవణ్‌కుమార్, వెన్న రాములు, పిల్లి శేఖర్, వెగ్గలం ప్రకాశ్, రాగుల రాజు పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు

గంగాధర, జూన్ 24: వెంకటాయపల్లిలో ఈ నెల 8న జరిగిన దొంగతనం కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సోమవారం గంగాధర పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. గన్నేరువరం మండలం హన్మాజీపేటకు చెందిన అమ్మిగల్ల ప్రశాంత్, మానకొండూర్‌కు చెందిన బోడ రాజశేఖర్‌ను అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇదే కేసులో ఈ నెల 13న ఇద్దరు, 16న ఒక నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఐదుగురు నిందితుల నుంచి 27.5 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇక్కడ ఎస్ఐలు వంశీకృష్ణ, శ్రీనివాస్, నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జూన్ 24: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మధురానగర్ చౌరస్తాలో మంగళవారం నిర్వహించిన రైతు భరోసా సంబురాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం చౌరస్తాలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వెలిచాల తిర్మల్‌రావు, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, పురుమల్ల మనోహర్, వేముల భాస్కర్, వేముల అంజి, బైరిశెట్టి సంపత్, దాతు అంజి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

కార్పొరేషన్, జూన్ 24 : మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం కోసం ఆర్పీలు కృషి చేయాలని మెప్మా పీడీ వేణుమాధవ్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం కరీంనగర్‌లోని కళాభారతిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త మహిళా గ్రూపుల ఏర్పాటు, వీధి వ్యాపారుల గుర్తింపు, రుణాల మంజూరుపై దృష్టి సారించాలని ఆదేశించారు.

ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్యం

హుజూరాబాద్ రూరల్, జూన్ 24: హుజూరాబాద్ ఏరియా దవాఖానలో మెరుగైన వైద్యం అందుతుందని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య సేవల కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం ఏరియా దవాఖానను సందర్శించారు. వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్

హుజూరాబాద్ టౌన్, జూన్ 24: జూలై 9న దేశవ్యాప్తంగా జరుగనున్న సమ్మెలో తాము పాల్గొననున్నట్లు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎండీ అజ్జూ, ఉపాధ్యక్షురాలు ఆర్ సరోజన, కోశాధికారి రాజేశ్వరి, ప్రచార కార్యదర్శి బొరగాల కుమార్, సభ్యులు కుమార్, సులోచన, అన్నపూర్ణ, ముక్క భిక్షపతి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

చిగురుమామిడి, జూన్ 24: ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 27న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి కోరారు. మంగళవారం చిగురుమామిడి మండలంలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శంకర్, మండలాధ్యక్షులు ముని ప్రసాద్, జి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 24: సబ్ స్టేషన్ మెయింటనెన్స్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఎలగందుల, బావుపేట, గ్రానైట్ ఇండస్ట్రీస్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పంబాల కులస్తులపై ప్రభుత్వం చిన్న చూపు

శంకరపట్నం, జూన్ 24: పంబాల కులస్తులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నదని తెలంగాణ పంబాల కులస్తుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గడ్డం విష్ణువర్ధన్ ఆరోపించారు. మంగళవారం ఆయన శంకరపట్నంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులు తమ కులస్తులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పంబాల కులస్తులను గ్రామ పూజారులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జమిడికె, సుతి, పంబజోడు, తాళాలు, తదితర వస్తువులను వాయిద్యాలుగా గుర్తించాలని కోరారు. కళాకారులకు ఉచిత బస్ పాస్‌లు, వయసుతో సంబంధం లేకుండా రూ.500 పెన్షన్ ఇవ్వాలని కోరారు. విలేకరుల సమావేశంలో రిటైర్డ్ ఎంఈవో గొట్టె జమదగ్ని, రిటైర్డ్ జైలర్ కొరిమి నరసింహస్వామి, కొరిమి వెంకటస్వామి, ఉదయ్ కుమార్, రవిసేన, రౌత్ సంపత్, గొట్టె మొగిలి, తదితరులు ఉన్నారు.

'పొనగంటి'కి ఫొటోగ్రఫీలో గోల్డ్ మెడల్

జమ్మికుంట, జూన్ 24: మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన పొనగంటి రాజు వెడ్డింగ్ ఫొటోగ్రఫీలో గోల్డ్‌మెడల్ సాధించాడు. 'ఐలాండ్ యువర్ ఫొటో వరల్డ్' ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఫొటోగ్రఫీ కాంపిటీషన్ పోటీలను ఇటీవల నిర్వహించగా, ప్రపంచవ్యాప్తంగా 18 దేశాల నుంచి 550 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. రాజు తాను తీసిన వెడ్డింగ్ ఫొటోను పంపగా, నిర్వాహకులు ప్రథమ బహుమతిని ప్రకటించారు. గోల్డ్‌మెడల్‌ను అందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

హుజూరాబాద్ రూరల్, జూన్ 24: మండలంలోని కందుగుల గ్రామ శివారులో పరకాల-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై ఈ నెల 20న రోడ్డు ప్రమాదానికి గురైన గుర్తు తెలియని వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35 ఏండ్ల వయసు గల సదరు వ్యక్తి ద్విచక్రవాహనం (ఏపీ13 ఎస్7055) పై నుంచి పడి తీవ్ర గాయాల పాలవగా, స్థానికులు గమనించి 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహం ఎంజీఎం దవాఖాన పోస్టుమార్టం గదిలో ఉందని, సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని హుజూరాబాద్ ఎస్ఐ యూనెస్ అహ్మద్ అలీ తెలిపారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి

హుజూరాబాద్ రూరల్, జూన్ 24: గత నెల 24న తాడిచెట్టు పైనుంచి కింద పడి తీవ్రగాయాలపాలైన పెద్ద పాపయ్యపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు బాలగోని రాములు (55), హనుమకొండ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం, గ్రామస్తులు కోరారు.

సమ్మెను సక్సెస్ చేయాలి

తెలంగాణచౌక్, జూన్ 24: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, సారయ్య, కొమురయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

సేవా గుణం అలవర్చుకోవాలి

విద్యార్థినులను అభినందిస్తున్న మధుసూదన్ రెడ్డి, రవీందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, జూన్ 24 : విద్య నేర్చుకోవడంతో పాటు సేవా గుణం ప్రతి ఒక్కరూ అలవర్చు కోవాలని కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. అల్ఫోర్స్ మహిళా డిగ్రీ పిజీ కళాశాల సమావేశ మందిరంలో లియో క్లబ్ ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల అల్ఫోర్స్ కళాశాల లియో క్లబ్‌కు ఉత్తమ లియో క్లబ్‌గా గుర్తింపు, అవార్డులు రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అల్ఫోర్స్ మహిళా కళాశాల అధిపతి వీ రవీందర్ రెడ్డి అధ్యక్షతన వహించి మాట్లాడుతూ, అల్ఫోర్స్ మహిళా కాలేజీ లియో క్లబ్ సభ్యులు అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో పౌర సమాజం మన్ననలతో పాటు రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు. ఉత్తమ లియో క్లబ్ అవార్డుతో పాటు కళాశాలకు చెందిన లియో క్లబ్ అధ్యక్షురాలు లియో కనక్ ముందాడ, కార్యదర్శి ఏ సాత్విక, కోశాధికారి కె వైషిత, డైరెక్టర్స్ లియో నవ్య గాలిపెల్లి, ఉత్తమ డాన్సర్స్ కె అమూల్య, మనస్విని, నవ్యశ్రీ రాష్ట్ర స్థాయిలో అవార్డులు, ప్రశంసలు పొందారని చెప్పారు.

పర్మినెంట్ చేయలేదని వాటర్ ట్యాంక్ ఎక్కిన కార్మికుడు

ఇల్లందకుంట, జూన్ 24: ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామపంచాయతీలో పర్లపల్లి మల్లేశ్ పదిహేనేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, తన తర్వాత విధుల్లో చేరిన కొందరు కార్మికులను పర్మినెంట్ చేశారని, తనను మాత్రం విస్మరించారని తీవ్ర మనస్తాపం చెందాడు. మంగళవారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి, గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, అధికారులతో మాట్లాడి మల్లేశ్‌కు తగిన న్యాయం చేస్తామని నచ్చచెప్పి కిందికి దింపారు.

ప్రజాభిప్రాయం మేరకే బ్రిడ్జి నిర్మించాలి

గన్నేరువరం, జూన్ 24: మానేరు వాగుపై గన్నేరువరం, బెజ్జంకి ఇల్లంతకుంట మండలాల ప్రజల అభిప్రాయం మేరకే బ్రిడ్జి నిర్మించాలని మాజీ జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, బ్రిడ్జి సాధన జేఏసీ నాయకులు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో బ్రిడ్జి సాధన జేఏసీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అవసరం లేని చోట బ్రిడ్జి నిర్మాణం చేపడితే ప్రభుత్వాలను ఉపేక్షించేది లేదని, పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గంప వెంకన్న, పుల్లెల లక్ష్మణ్, రామచంద్రరావు, జక్కన్నపెల్లి సత్తయ్య, బుర్ర శ్రీనివాస్ గౌడ్, విలాసాగరం రామచంద్రం, బ్రిడ్జి సాధన జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఉద్యోగులకు ఉచిత మెగా వైద్య శిబిరం

విద్యానగర్, జూన్ 24 : కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని టీజీ ట్రాన్స్‌కో ఉద్యోగులు, సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ట్రాన్స్‌కో సీఈ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 120 మందికి కార్డియాలజిస్టు డీ వాసుదేవ రెడ్డి గుండె వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ, తమ హాస్పిటల్‌లో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. శిబిరంలో హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సొన్నాయిల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్‌పై అమెరికా దాడులకు నిరసన

తెలంగాణచౌక్, జూన్ 24: ఇరాన్‌పై అమెరికా దాడులను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ జిల్లా, నగర కమిటీ నాయకులు పాల్గొని, అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు సహకరించాలి

సైదాపూర్, జూన్ 24: క్షయ నివారణ విభాగం, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ – టీబీ అలర్ట్ ఇండియా సహకారంతో సైదాపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ రావ్ ఆధ్వర్యంలో మంగళవారం సైదాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో టీబీ చాంపియన్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైదాపూర్ ఎంపీడీవో యాదగిరి, హుజూరాబాద్ టీయూ ఎస్‌టీఎస్ శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడారు. గ్రామాలను టీబీ రహితంగా మార్చేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. హెల్త్ సూపర్ వైజర్ రమేశ్, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్ సురేందర్ టీబీ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ టీయూ టీబీహెచ్‌వీ నిశాంత్, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

'నమస్తే' కథనానికి స్పందన

రోడ్డు పక్కన చెత్త తొలగింపు


చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

కార్పొరేషన్, జూన్ 24: కరీంనగర్ నగరపాలక సంస్థలో చింతకుంట నుంచి శాతవాహన యూనివర్సిటీ రోడ్డు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను నగరపాలక అధికారులు మంగళవారం తొలగించే పనులు చేపట్టారు. ఈనెల 16న 'పారిశుధ్యం.. అస్తవ్యస్తం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కాగా, నగర కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ స్పందించి పారిశుధ్య విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై రోడ్ల పక్కన చెత్త వేసే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

డాగ్‌స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

కరీంనగర్ రూరల్, జూన్ 24: మాదక ద్రవ్యాల నిర్మూలనకు కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్, కేఫ్‌లు, టీ స్టాల్స్, బొమ్మకల్ పరిధిలోని కేఫ్స్, ఇతర ప్రదేశాల్లో సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు చేశారు.

ఇంజనీరింగ్ పనులపై కమిషనర్ దృష్టి

- ఎంబీల మాయంపై ఆగ్రహం
- వీధిదీపాల నిర్వహణ తీరుపై అసంతృప్తి

కార్పొరేషన్, జూన్ 24: కరీంనగర్ నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగం పనితీరుపై నూతన కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలో అభివృద్ధి పనులు చేపట్టడంలో ఎంతో కీలకమైన ఈ విభాగంపై పదే పదే ఆరోపణలు వస్తున్నా అధికారుల పనితీరు మారకపోవడం, నగరంలో వివిధ సమస్యలు పేరుకుపోతుండడంతో కమిషనర్ పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టినట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో సోమవారం జరిగిన ఇంజినీరింగ్ విభాగం సమీక్షా సమావేశంలోనూ ఇంజినీరింగ్ అధికారుల పనితీరు, అలాగే ఇంజినీరింగ్ విభాగంలో ఎంబీ రికార్డులు మాయం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ సందర్భంగా అకౌంట్స్ విభాగంలోనే ఎంబీ రికార్డులు మాయం అవుతున్నాయని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొనగా, అసలు రికార్డు మూమెంట్ రిజిస్టర్ ఎక్కడా అని కమిషనర్ నిలదీసినట్లు తెలిసింది. దీనిపై ఇంజినీరింగ్ అధికారులు నీళ్లు నమలడంతో ఇకపై తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్ కొనసాగించాలని తీవ్ర స్థాయిలో ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. కాంట్రాక్టర్ల చేతుల్లో ఎంబీ రికార్డు కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరికలు కూడా జారీ చేశారు. దీంతో పాటు నగరంలో వీధిదీపాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్, డీఈ నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిస్థితిని పరిశీలించి తనకు నివేదిక అందించాలని ఆదేశాలు ఇవ్వడం గమనార్హం. అలాగే అల్గునూర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహ పనుల విషయంలో లోతుగా సమీక్షించినట్లు తెలిసింది. ఎక్కడి పనులు అక్కడే ఉండగా కాంట్రాక్టర్లకు ఎలా బిల్లులు చెల్లించారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఇకపై ఇలాంటి వాటిని ఉపేక్షించబోమని, తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిసింది. మొత్తానికి కమిషనర్ ఇంజినీరింగ్ అధికారుల పనితీరుపై దృష్టి సారించి, గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్న చర్చ నగర పాలక సంస్థలో జరుగుతున్నది.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I, KAVITA KHINCHI W/o.KISHAN LAL NAVRIYA R/o.Q.No.D-7/25, PTS, NTPC Jyothinagar, Ramagundam mandal, Peddapalli district, TG. I have changed my name from KAVITA NAVRIYA to KAVITA KHINCHI.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ఫారం నెం.29
అమ్మకం ప్రకటన (ఆర్డర్ XX1 రూల్ 66)
కరీంనగర్ వద్ద గౌరవనీయ III అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ న్యాయస్థానంలో

ARB No.(84) ఆఫ్ 2019లో ARB E P No.[267]

వీరి మధ్య:
మెసర్స్ శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ ....పిటిషనర్/DHR
మరియు
చల్ల చైతన్య మరియు ఇతరులు ....ప్రతివాదులు/ JDRs
వీరికి: కోర్టు బంట్రోతు

ఇందుమూలంగా తెలియజేయునదేమనగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని కోడ్ ఆర్డర్ XXI యొక్క రూల్ 64 క్రింద, EP No.267/2021 III అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్, కరీంనగర్ న్యాయస్థానం ద్వారా నిర్ణయించబడినది, ఇందులో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ అనేది పిటిషనర్ మరియు చల్ల చైతన్య మరియు ఇతరులు ప్రతివాదులు 1908 ఒక ఉత్తర్వు అమ్మకం తేదీ వరకు వ్యయాలు మరియు వడ్డీతో సహా, మార్జిన్‌లో తెలిపిన దావాలో డిక్రీ హోల్డర్ క్లెయిం సంతృప్తి మేరకు అనుబంధ షెడ్యూల్‌లో తెలిపిన జప్తు చేయబడిన ఆస్తి అమ్మకం కొరకు ఈ గౌరవనీయ న్యాయస్థానం ద్వారా జారీచేయబడినది. సదరు అమ్మకం బహిరంగ వేలంలో నిర్వహించబడును మరియు షెడ్యూల్‌లో తెలిపిన విధంగా పైన తెలిపిన జడ్జిమెంట్ డెటార్స్ యొక్క ఆస్తి అమ్మకం కొరకు ఉంచబడిన సదరు ఆస్తి పేర్కొన్న విధంగా లాట్లలో ఉంటుంది మరియు నిర్ధారించబడినంత వరకు లయబిలిటీస్ మరియు క్లెయింలు సదరు ఆస్తికి అటాచ్ చేయబడినవి ప్రతీ లాట్‌లో షెడ్యూల్ పేర్కొనబడినవి. ఎలాంటి వాయిదా లేకుంటే సదరు అమ్మకం III అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ఆవరణలో 16.07.2025న మ.1.30 గం.కు ప్రారంభమయ్యే నెలవారి అమ్మకం వద్ద III అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ ద్వారా నిర్వహించబడును, అయితే పైన తెలిపిన డెట్ మరియు అమ్మకం ఖర్చులు ఏదేని లాట్ కొట్టివేయడానికి ముందు చెల్లించబడినట్లయితే అమ్మకం నిలిపివేయబడును.

EP No.267/2021 III అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్, కరీంనగర్ న్యాయస్థానం ద్వారా నిర్ణయించబడినది, ఇందులో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ అనేది పిటిషనర్ మరియు చల్ల చైతన్య మరియు ఇతరులు ప్రతివాదులు

సదరు అమ్మకంలో స్వయంగా లేదా అధీకృత ఏజెంట్ ద్వారా బిడ్ వేయుటకు సాధారణ ప్రజానీకాన్ని ఆహ్వానించడమైనది, పైన తెలిపిన జడ్జిమెంట్ క్రెడిటార్స్ లేదా వారి తరపున ఎలాంటి బిడ్ వేయరాదు, అనుమతించబడదు లేదా ఇంతకుముందు ఇవ్వబడిన కోర్టు అనుమతి లేకుండా చెల్లుబాటు కాదు.

అమ్మకం నిబంధనలు
1) దిగువ షెడ్యూల్‌లో ఇవ్వబడిన వివరాలు న్యాయస్థానం పరిజ్ఞానం మేరకు తెలియజేయబడినవి, అయితే ఈ ప్రకటనలో ఏదేని తప్పు, అవాస్తవిక కథనం లేదా లోపం కొరకు న్యాయస్థానం జవాబుదారి కాదు.
2) బిడ్డింగ్స్ పెంపుదల మొత్తం అమ్మకం నిర్వహించబడు అధికారిచే నిర్ణయించబడుతుంది. బిడ్ మొత్తం లేదా బిడ్డర్‌లలో వివాదం ఏర్పడితే సదరు లాట్ మరలా వేలం వేయబడును.
3) అతను అన్ని వేళలా చట్టబద్ధంగా బిడ్డింగ్ వేయడానికి అర్హత కలిగి ఉన్నప్పుడు అత్యధిక బిడ్డరు ఏదేని లాట్ కొనుగోలుదారుగా ప్రకటించబడతాడు మరియు అలా చేయుటకు సముచితమని భావిస్తే ఆఫర్ చేయబడిన తగినంతగా స్పష్టంగా కనిపిస్తే అత్యధిక బిడ్‌ను అంగీకరించడాన్ని తిరస్కరించుటకు కోర్టుకు లేదా అధికారి విచక్షణ మేరకు ఉంటుంది.
4) రికార్డ్ చేయబడిన కారణాల నిమిత్తం ఆర్డర్ XXI యొక్క రూల్ 69 నిబంధనలకు ఎల్లప్పుడు అమ్మకం నిర్వహించు అధికారికి వాయిదా వేయడం అతని అభీష్టానుసారం ఉంటుంది.
5) స్థిరాస్తి లేనప్పుడు ప్రతి లాట్ ధర అమ్మకం సమయంలో లేదా అమ్మకం నిర్వహించబడు అధికారి ఆదేశించిన విధంగా చెల్లించాలి మరియు చెల్లించుటలో విఫలమైతే ఆస్తి వెంటనే వేలం వేసి మరలా విక్రయించబడును.
6) స్థిరాస్తి అయినచో కొనుగోలుదారుగా ప్రకటించబడిన వ్యక్తి సదరు ప్రకటన తర్వాత వెంటనే తన కొనుగోలు సొమ్ములో 25 శాతం డిపాజిట్‌ను అమ్మకం నిర్వహించబడే అధికారికి చెల్లించాలి మరియు సదరు డిపాజిట్ చేయుటలో విఫలమైతే ఆస్తి వెంటనే వేలం వేసి మరలా విక్రయించబడును.
7) కొనుగోలు సొమ్ము పూర్తి మొత్తం ఆస్తి అమ్మకం తర్వాత పదిహేనవ రోజున కోర్టు ముగిసేలోగా కొనుగోలుదారు చెల్లించాలి. ఆ రోజు మినహా లేదా పదిహేనవ రోజు ఆదివారం అయినా లేదా ఇదర సెలవు రోజు అయినా పదిహేనవ రోజు తర్వాత మొదటి కార్యాలయ రోజున చెల్లించాలి.
8) సదరు కాలవ్యవధిలోగా మిగిలిన మొత్తాన్ని చెల్లించుటలో విఫలమైతే సదరు ఆస్తి తాజా అమ్మకం ప్రకటన జారీ చేసి మరలా విక్రయించబడును. కోర్టు సముచితమని భావిస్తే అమ్మకం ఖర్చులను తీసి డిపాజిట్‌ను ప్రభుత్వానికి జప్తు చేయవచ్చు మరియు విఫలమైన కొనుగోలుదారు సదరు ఆస్తి అందలి ఏదేని భాగంలో అన్ని క్లెయింలను కోల్పోతారు మరియు దానిని తర్వాత విక్రయించబడును.

షెడ్యూలు

అమ్మకం తేదీ మరియు సమయం	లాట్ నెం.	ఆస్తి వివరణ	భూమిపై అంచనా వేయబడిన రెవెన్యూ లేదా అద్దె, దానిపై చెల్లించబడు స్థానిక పన్నులు మరియు రేట్లు			రిజిస్టర్డ్ డాక్యుమెంట్స్		రిమార్కులు
			జడ్జిమెంట్ డెటార్స్ ప్రయోజనం	బకాయి మొత్తం	వార్షిక	రిజిస్టర్ తేది మరియు రిఫరెన్స్	డాక్యుమెంట్ల సంక్షిప్త వివరణ	
	1	షెడ్యూల్ ఆస్తి-A: సబ్‌జిల్లా మరియు జిల్లా రిజిస్ట్రేషన్ కరీంనగర్ అధికార పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ కరీంనగర్ పరిధిలో, కరీంనగర్ టౌన్, ఖార్కానాగడ్డ లొకాలిటి వద్ద గల 81.98 చ.గజాలు లేదా 68.53 చ.మీటర్లు విస్తీర్ణం, ఇం.నెం.6-5-85 కలిగిన ఇంటికి చెందిన ఖాళీ భూమి, JDr No.2 పేరున సదరు ఆస్తి కలదు. సరిహద్దులు: తూర్పు: చల్ల శారద ఇం.నం.6-5-85, పడమర: ఇతరుల ఇల్లు, ఉత్తరం: గాసికంటి అనంతయ్య ఇం.నెం. 6-5-81, దక్షిణం: 15 అడుగుల రోడ్. షెడ్యూల్ ఆస్తి-B: సబ్‌జిల్లా మరియు జిల్లా రిజిస్ట్రేషన్ కరీంనగర్ అధికార పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్ కరీంనగర్ పరిధిలో, కరీంనగర్ టౌన్, ఖార్కానాగడ్డ లొకాలిటి వద్ద గల 68.28 చ.గజాలు లేదా 68.53 చ.మీటర్లు విస్తీర్ణం, ఇం.నెం.6-5-85 కలిగిన ఇంటికి చెందిన ఖాళీ భూమి, JDr No.2 పేరున సదరు ఆస్తి కలదు. సరిహద్దులు: తూర్పు: ఎస్.ఆశాదేవి ఇల్లు, పడమర: చల్ల శారద ఖాళీ భూమి, ఉత్తరం: గాసికంటి అనంతయ్య ఇం.నెం. 6-5-81, దక్షిణం: 15 అడుగుల వెడల్పు రోడ్.	షెడ్యూల్ ఆస్తి యజమాని	రూ. 26,20,994/-	-	-	-	-

11 జూన్ 2025న నాచే సదరు న్యాయస్థానం ముద్రవేయబడి ఇవ్వబడినది.

III అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, కరీంనగర్